
ప్రజాశక్తి

బుధవారం 5 జూన్ 2024 | 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు



చంద్రగిరి రారాజు పులివర్తి నాని

వలసొచ్చి విజయం కైవసం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈసారి ఎన్నికల్లో వలసొచ్చి విజయం సాధించినవారూ లేకపోలేదు. తిరుపతిలో వైసిపి నుంచి జనసేనలోకి వలసొచ్చిన ఆరణి శ్రీనివాసులు, సత్యవేడులో వైసిపి నుంచి టిడిపిలోకి వలసొచ్చిన ఆదిమూలం విజయం సాధించారు. ఇద్దరూ వాస్తవానికి వైసిపిలో సిట్టింగ్ ఎంఎల్ఎలే. చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు బాపట్ల నుంచి వలసొచ్చి ఊహించని రీతిలో భారీ మెజార్టీతో గెలుపొందారు.

తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి

62 వేల ఓట్లతో గెలుపు

ప్రజాశక్తి తిరుపతి టౌన్



తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు 62 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించిన కౌంటింగ్ కేంద్రంలో ఉదయం పోస్టల్ బ్యాలెట్ లను లెక్కించడం జరిగింది. తరువాత ఈవీఎంలతో కౌంటింగ్ నిర్వహించారు తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులకు1,21 205 ఓట్లు వచ్చాయి. 62 వేల 31 ఓట్లతో గెలుపు పొందారు.వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డికి60,950 ఓట్లు వచ్చాయి ఇండియా కూటమి తరపున పోటీ చేసిన పి మురళి 600 ఓట్లు వచ్చాయి. నోటాకు1218 ఓట్లు వచ్చాయి. తిరుపతి అసెంబ్లీకి 47 మంది అభ్యర్థులు పోటీ చేశారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)



చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నానిని సాధారణ ఎన్నికలలో ఓటర్లు అఖండ మెజారిటీతో గెలిపించి చంద్రగిరి కోటకు రారాజును చేశారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపు లో పులివర్తి నాని చంద్రగిరి ఎమ్మెల్యేగా 43,873 ఓట్ల ఆధిక్యతతో అద్భుత విజయం కైవసం చేసుకున్నారు. మూడు దశాబ్దాల అనంతరం చంద్రగిరి కోట పైన పసుపు జెండా రెపరెపలాడింది. రెండు పర్యాయాలు చంద్రగిరిలో ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి సహజ వనరులను పూర్తిగా దోచుకుని, ప్రజలను పట్టించుకోక తనను నమ్మిన ద్వితీయ శ్రేణి నాయకులను ఎదగనీయకుండా ఒంటెత్తు పోకడతో వెళ్లటం వల్లనే చెవిరెడ్డి తనయుడు మోహిత్ రెడ్డికి పరాజయం ఎదురయ్యిందని చర్చ నడుస్తోంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు సొంత నియోజకవర్గంలో గెలవలేదన్న అపవాదును పోగొట్టి ఉమ్మడి పార్టీలైన తెలుగుదేశం, బీజేపీ జనసేన శ్రేణులు చంద్రగిరిలో పులివర్తి నానిని గెలిపించి చంద్రన్నకు కానుకగా ఇచ్చి లోటును పోగొట్టారు. 2019 ఎన్నికలలో ఓటమి చెందిన పులివర్తి నాని నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ప్రజల కష్టనష్టాలను తన సొంత కష్టనష్టాలుగా భావించి అందరి మన్ననలు అందుకున్నారు. ఇదే సమయంలో చెవిరెడ్డి ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోలేదన్న ఆరోపణలు లేకపోలేదు. చెవిరెడ్డి కుటుంబం ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపు, మఠం భూములు, ప్రభుత్వ భూముల దురాక్రమణ, తుడా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని టిడిపి ఆరోపిస్తోంది. నియోజకవర్గాన్ని గంజాయి మత్తులో ముంచేశారన్న అపవాదునూ మూటగట్టుకున్నారు.

ఓట్ల లెక్కింపు సరళి.....చంద్రగిరి నియోజకవర్గానికి

మూడు దశాబ్దాల తరువాత టిడిపి రెపరెపలు

సంబంధించి ఓట్ల లెక్కింపు మంగళవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. భారీ ఎత్తున పోలీసు బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొదట ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కించడం ప్రారంభించారు. 8:30 గంటలకు ఈవీఎం లో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అయితే యర్రా వారి పాలెం పాలెం నుంచి ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి పులువర్తి నాని ఆధిక్యత ప్రారంభించారు. మొదటి రౌండులో 2654 ఓట్లతో ప్రారంభమైన ఆధిక్యం, 20వ రౌండ్ చేరుకునేసరికి 43,396 ఆదిక్యంతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పైన అద్భుతంగా విజయం సాధించారు. 2019 లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సాధించిన 41,755 ఓట్లు కన్నా పులివర్తి నాని 43,873 మెజారిటీ సాధించి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మెజారిటీ రికార్డును బద్దలు కొట్టారు. చంద్రగిరిలో పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) విజయం సాధించినట్లు చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి నిశాంత్ రెడ్డి డిక్లరేషన్ ఫారాని నానికి అందజేసి అభినందనలు తెలిపారు.

వెంకటగిరి కోట కురుగొండ్ల రామకృష్ణదే..!

ప్రజాశక్తి-వెంకటగిరి, డక్కిలి

వెంకటగిరి నియోజకవర్గంలో ఈదఫా తెలుగుదేశంపార్టీ జెండా మరోసారి ఎగిరింది. 2009, 2014 తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించారు. 2019లో హాట్రిక్ విజయంకు ప్రయత్నించి అప్పటి వైసిపి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి మీద పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వెంకటగిరి నియోజకవర్గ చరిత్రలో ఏ అభ్యర్థి నాల్గో దఫా పోటీ చేసిన చరిత్ర ఇప్పటి వరకు లేదు. ఈ చరిత్రను తిరగరాస్తూ కురుగొండ్ల రామకృష్ణ నాల్గో దఫా పోటీకి సిద్దమై టిడిపి అభ్యర్థిగా రంగంలోకి దిగి వైసిపి అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిపై 16,295ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కురుగొండ్ల రామకృష్ణకు 1,02,716 ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్లు 1681ఓట్లు సాధించారు. వైసిపి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఇవియంల ద్వారా 87,262ఓట్లు రాగా పోస్టల్ బ్యాలెట్ల ద్వారా మరో 841ఓట్లు సాధించారు. కురుగొండ్ల రామకృష్ణకు మొత్తం 16,294ఓట్లు ఆధిక్యత సాధించినట్లు అయింది. నోటాకు 3018ఓట్లతో మూడవ స్థానం దక్కగా, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పంటా శ్రీనివాసులరెడ్డికి 1918ఓట్లు సాధించి నాల్గోవ స్థానంతో సరిపెట్టుకున్నారు.

తొలి నుంచి ఆధిక్యంలోనే.. నియోజకవర్గంలో మొత్తం 22రౌండ్లు జరిగిన ఓట్ల లెక్కింపులో మొదటి రౌండు నుండి ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చింది. 22రౌండ్లు గాను 4, 6, 7, 10 రౌండ్లు మినహా మిగిలిన 18రౌండ్లలలో తెలుగుదేశం అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ మొదటి స్థానంలో ఉండగా వైసిపి అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ద్వితీయ స్థానంలో ఉన్నారు. ఇంకా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించారన్నా సమాచారం అందడంతో వెంకటగిరి పట్టణంలో బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.వైసిపి అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి కురుగొండ్లకు అభినందనలు తెలియజేశారు.

పుంగనూరు 'పెద్దిరెడ్డి' దే

ప్రజాశక్తి - పుంగనూరు: పుంగనూరు 2024 లోనూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఖాతాకే చేరింది. ఓటమెరుగ(ని) నాయక(ు)డిగా 2009 నుంచి వరుసగా ఎమ్మెల్యేగా ఎ(న్ని)క అవుతూ వస్తున్న పెద్దిరెడ్డి ఈ దఫా ఎన్నడూ లే(ని) విధంగా అత్యంత స్వల్ప మెజార్టీ 6095తో గట్టెక్కడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పుంగనూరు (ని)యోజకవర్గం నుంచి 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు 40,727 ఓట్ల మెజార్టీతో, 2014లో 31,371 ఓట్ల మెజారిటీ, 2019లో 43,555 ఓట్ల మెజారిటీతో విజయదుందిభి మోగించిన పెద్దిరెడ్డి ఈ దఫా టిడిపి అభ్యర్థి చల్లాబాబు (రామచంద్రారెడ్డి) పై కేవలం ఆరువేల ఓట్లతో సరిపెట్టుకోవడమంటే ఓటమి చెందినట్లే ప్రచారం జరుగుతోంది. తాను గెలవడమే కాదు...చిత్తూరు జిల్లా అంతటా తన అనుయాయుల్ని ఒంటిచేత్తో గెలిపించుకోగలిగిన ఆయన ఈసారి ఆయన గెలవడా(ని)కి కూడా ప్రతి రౌండ్‌లోనూ ఆపసోపాలు పడటం గమనార్హం. అయితే పెద్దగా అంచనాలేమీ లేని టిడిపి అభ్యర్థి చల్లా బాబు అనూహ్యంగా ప్రతి రౌండ్‌లోనూ పోటాపోటీగా ఓట్లు సాధించి పెద్దిరెడ్డికి ధీటుగా 94,698 ఓట్లతో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారారు. ఓ దశలో పెద్దిరెడ్డే ఓటమి చెందాడన్న రీతిలో పోటీ ఇవ్వడం గమనార్హం. ఎట్టకేలకు రాష్ట్రవ్యాప్తంగా వీచిన తెలుగుదేశం పార్టీ గాలిలోనూ పెద్దిరెడ్డి తనయుడైన మిధున్‌రెడ్డి రాజంపేట ఎంపీగా, తమ్ముడు ద్వారకనాధరెడ్డిని తంబళ్లపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకొని పరువు నిలుపుకోవడం గమనార్హం.

బొజ్జల సుధీర్ రెడ్డి 'రికార్డు' విజయం

టీడీపీ కూటమికి 43,304 ఓట్లు మెజార్టీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి రికార్డు సృష్టించారు. 1952 నుంచి శ్రీకాళహస్తి ఎన్నికల చరిత్రలో ఎవరూ సాధించని మెజార్టీ సాధించారు. చరిత్రను తిరగ రాస్తూ బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి 43,304 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. టీడీపీ కూటమి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి 1,21,565 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డికి 78,261ఓట్లు వచ్చాయి. టీడీపీ కూటమి విజయంతో శ్రీకాళహస్తిలో సంబరాలు అంబరాన్నంటాయి. గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. తిరుపతి నగరంలోని శ్రీ పద్మావతి విశ్వ విద్యాలయం ప్రాంగణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరిగింది. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్ల ద్వారా 21 రౌండ్లు ఓట్లు లెక్కింపు జరిగింది. మొదటి రౌండు నుంచి టీడీపీ కూటమి అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. కనీసం ఒక్క రౌండులో కూడా వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదనరెడ్డికి ఆధిక్యత రాలేదు. బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి ఈవీఎంల ద్వారా 1,19,554 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2,011 ఓట్లు వచ్చాయి. ఇక బియ్యపు మధుసూదనరెడ్డికి ఈవీఎంల ద్వారా 77,575 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 686 ఓట్లు వచ్చాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొత్తం 2,06,914 ఓట్లు (ఈవీఎంల ద్వారా) పోల్ అయ్యాయి. శ్రీకాళహస్తిలో పోల్ అయిన ఓట్లలో బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి 58.08శాతం ఓట్లు... బియ్యపు మధుసూదన్ రెడ్డికి 37.39శాతం వచ్చాయి. అంటే వీరిద్దరి మధ్య 20.69శాతం ఓట్ల తేడా వచ్చింది. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డికి 1,09,541ఓట్లు (55.89శాతం), టీడీపీ అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి 71,400(36.43శాతం) ఓట్లు వచ్చాయి. అప్పట్లో వీరిద్దరి మధ్య ఓట్ల వ్యత్యాసం 19.46శాతం. అయితే ఈ ఎన్నికల్లో బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఏకంగా 21.65శాతం ఓట్లు అధికంగా సాధించడం విశేషం. ఇక ఈ సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి మొత్తం 15మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇందులో కె.సురేంద్రబాబు (బీయస్పీ)కి 1,403, డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు (కాంగ్రెస్) కు 3,002, కె.దీనాద్ బాబు (భారత చైతన్య యువజన పార్టీ)కు 547, డాక్టర్ జి.రమేష్ (నేషనలిస్ట్ జనశక్తి పార్టీ)కు 113, డి.గోవిందస్వామి (సమాజ్ వాది పార్టీ)కి 90, రొమ్మాల నిరంజన్ రెడ్డి (జైభారత్



నేషనల్ పార్టీ)కి 144, అత్తిరాల పావని (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)కి 134, పలి పుష్పలత (వీసీకే)కు 124 వంతున ఓట్లు వచ్చాయి. ఇక స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన చుక్కల ఎల్లయ్యకు 100, కె.చిరంజీవికి 261, పి.శ్రీనివాసులురెడ్డికి 334, పేరం నాగరాజునాయుడుకు 228, టి.భాస్కర్ కు 1,018 వంతున ఓట్లు వచ్చాయి. శ్రీకాళహస్తిలో నోటాకు 1,949మంది ఓటు వేశారు.

మిద్దెల హరి రాజీనామా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ సీనియర్ నేత, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, మాజీ ఆప్కో డైరెక్టర్ మిద్దెల హరి ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవికి మంగళవారం రాజీనామా చేశారు. ఆ మేరకు ఆర్టీసీ ఎండీకి తన రాజీనామా లేఖను పంపారు. సార్వత్రిక ఎన్ని కల ఫలితాల్లో తమ పార్టీ ఘోర పరాభవాన్ని ఎదుర్కొన్న సం దర్భంగా ప్రజా తీర్పును గౌరవిస్తూ తానీ నిర్ణయం తీసు కున్నట్లు మిద్దెల హరి వివరించారు. తనకు సహకరించిన ఆర్టీసీ యాజమాన్యానికి, ప్రజలకు, నాయకుల కు, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చెవిరెడ్డి ఇంట ఓటమి విషాదం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: చంద్రగిరి మాజీ ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంట విషాద వాతావరణం నెలకొంది. దాదాపు ఏడాది క్రితమే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన వారసునిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ప్రకటించారు. 'గడప గడపకూ మీ మోహిత్‌రెడ్డి' పేరుతో నియోజకవర్గమంతా పాదయాత్ర నిర్వహించారు. కరోనా సమయంలోనూ, పండగల వేళా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ నిత్యావసరాలు, 'బహుమతులను' అందజేశారు. చంద్రగిరి నుంచి కొడుకు మోహిత్‌రెడ్డి బరిలో నిలవగా, ఒంగోలు ఎంపి అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిలిచారు. అయితే తండ్రీకొడుకులు ఇద్దరూ ఓటమినే చవి చూశారు. 'రెండుసార్లు ఓడించారు.. ఒక్కసారి అవకాశం ఇవ్వండి' అనే పులివర్తి నాని ప్రచారం ఓటర్లపై బాగా పనిచేసిందని చెప్పవచ్చు.



సూపర్ 6 సక్సెస్

- అంతటా టిడిపి ప్రభంజనం
- స్వల్ప మెజార్టీతో పెద్దిరెడ్డి గెలుపు
- ఆర్‌కె రోజాకు తొలినుంచి పరాభవం
- దుగ్గమళ్లకు బంపర్ మెజార్టీ
- జనసేన ఆరణికి 62వేలు ఆధిక్యం

నియోజకవర్గం	టిడిపి	వైసిపి	ఆధిక్యత	ఇండియా ఫోరం	నోటా
తిరుపతి	1,21,205	60,950	62,000	సిపిఐ 600	1218
చంద్రగిరి	1,40,861	98,304	42,557	కాంగ్రెస్ 3170	1650
వెంకటగిరి	1,04,397	88,103	16,294	కాంగ్రెస్ 1918	3,118
శ్రీకాళహస్తి	1,19,554	77,575	41,979	కాంగ్రెస్ 3,002	1949
సత్యవేడు	84,626	81,311	3,315	కాంగ్రెస్ 1264	773
గూడూరు	1,26,075	81,483	23,023	కాంగ్రెస్ 3,276	3,119
సూళ్లూరుపేట	1,11,048	81,933	29,115	కాంగ్రెస్ 4,124	1655

నియోజకవర్గం	టిడిపి	వైసిపి	ఆధిక్యత	ఇండియా ఫోరం	నోటా
చిత్తూరు	88,066	73,462	14,604	కాంగ్రెస్ 3264	1096
జీడీనెల్లూరు	1,01,176	75,165	26,011	కాంగ్రెస్ 2682	2125
నగరి	1,07,797	62,793	45,006	కాంగ్రెస్ 4551	1744
పలమనేరు	1,23,232	1,03,110	20,122	కాంగ్రెస్ 4015	2344
పుంగనూరు	94,698	1,00,793	6095 (వైసిపి)	కాంగ్రెస్ 3571	2904
పూతలపట్టు	1,02,137	86,503	15,634	కాంగ్రెస్ 2820	1420
కుప్పం	1,21,929	73,923	48,006	కాంగ్రెస్ 2574	2115

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఓడలు బండ్లు అవుతాయి... బండ్లు ఓడలవుతాయి' అంటే ఇదేనేమో.. 2019లో కుప్పం మినహా వైసిపి 13 నియోజకవర్గాల్లో ప్రభంజనం సృష్టించగా, 2024 నాటికి సీన్ రివర్స్ అయ్యింది. పుంగనూరు మినహా 13 నియోజకవర్గాల్లో సైకిల్ దూసుకెళ్లింది.. ఎగ్జిట్‌పోల్స్, జ్యోతిష్యాలు సైతం తలకిందులయ్యాయి.. సిట్టింగ్ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, కళత్తూరు నారాయణస్వామిలకు తీవ్ర పరాభవం ఎదురయ్యింది. చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు భారీ మెజార్టీని కైవసం చేసుకున్నారు. తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి గెలుపొందినా కౌంటింగ్ ఆద్యంతం అత్యంత ఉత్కంఠగా సాగింది. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి నేదురుమల్లి విజయశ్రీ మహిళా ఎంఎల్‌ఎగా తొలిసారి అసెంబ్లీలోకి వెళ్లనున్నారు. ఇక వారసులుగా వైసిపి నుంచి బరిలో దిగిన భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిలకు శృంగభంగమే ఎదురయ్యింది. సిట్టింగ్‌లుగా ఉండి జనసేన, టిడిపిలోకి వలసొచ్చిన ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలంలను విజయం వరించింది.

శ్రీకాళహస్తిలో బియ్యపు మధు సూదన్‌రెడ్డి ఓటర్లకు భారీగా నగదు, చీరలు, ముక్కుపుడకలు, మెట్టెలు పంపిణీ చేసినా బెడిసికొట్టింది. సామాన్యుడిగా అసెంబ్లీ బరిలో దిగిన పూతలపట్టు టిడిపి ఎంఎల్‌ఎ మురళీమోహన్ ఘన విజయం సాధించడాన్ని జర్నలిస్టుసంఘాలు హర్షిస్తున్నాయి. ఏదిఏమైనా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వైసిపి ఘోర పరాజయం అంతా స్వయంకృతాపరాధం. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, కళత్తూరు నారాయణస్వామి గ్రూపులే కారణం. చిత్తూరు టిడిపి ఎంపి అభ్యర్థి ఏకపక్షంగా విజయం సాధించగా, తిరుపతిలో మాత్రం క్రాస్ ఓటింగ్ జరిగి వైసిపి సిట్టింగ్ ఎంపి మద్దిల గురుమూర్తిని విజయం వరించింది. ఏదిఏమైనా టిడిపి ఘన విజయానికి సూపర్‌సిక్స్ మ్యానిఫెస్టో, పింఛన్ పెంపు, బిసిలకు 50 ఏళ్లకే పింఛన్ ఓటర్లపై తీవ్ర ప్రభావాన్ని చూపాయని చెప్పవచ్చు.

తొలి సంతకం వీటిపైనేనా..?

టిడిపి- జనసేన - బిజెపి కూటమి ఘన విజయం సాధించింది. ఈనెల 9న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా చంద్రబాబు నాయుడు చెప్పినట్లు మెగా డిఎస్‌సిపై తొలిసంతకం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేయాల్సి ఉంది.

సూపర్ సిక్స్ పథకాలు

1. 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి.
2. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు
3. ప్రతి రైతుకూ ఏటా రూ.20వేల ఆర్థిక సాయం
4. ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు
5. ప్రతి మహిళకు నెలకు రూ.1500
6. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం


తిరుపతి లోక్ సభ

వైసిపి గురుమూర్తి- 6,32,228 ఓట్లు
బిజెపి వరప్రసాద్ - 6,17, 659 ఓట్లు
ఆధిక్యత - 14, 569 ఓట్లు
కాంగ్రెస్ - 65,523
నోటా - 18,118

చిత్తూరు లోక్ సభ

టిడిపి దగ్గుమళ్ల ప్రసాద రావు - 7,80,071
వైసిపి - ఎన్. రెడ్డప్ప- 5,57,592
ఆధిక్యత - 2,20,479
కాంగ్రెస్ - 30,150
నోటా - 11, 976

చిత్తూరు జిల్లా నియోజకవర్గ ఎమ్మెల్యేలు



నారా చంద్రబాబు నాయుడు
కుప్పం ఎమ్మెల్యే (టిడిపి)



చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
పుంగనూరు ఎమ్మెల్యే (వైసిపి)



ఎన్. అమరనాథరెడ్డి
పలమనేరు ఎమ్మెల్యే (టిడిపి)



తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి



గురజాల జగన్‌మోహన్
చిత్తూరు ఎమ్మెల్యే (టిడిపి)



గాలి భానుప్రకాష్
నగరి ఎమ్మెల్యే (టిడిపి)



నెలవల విజయశ్రీ
సూళ్లూరుపేట ఎమ్మెల్యే (టిడిపి)



డాక్టర్ థామస్
జిడి నెల్లూరు ఎమ్మెల్యే (టిడిపి)



కలికిరి మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే (టిడిపి)

తిరుపతి జిల్లా నియోజకవర్గ ఎమ్మెల్యేలు



కురుగొండ్ల రామకృష్ణ
వెంకటగిరి ఎమ్మెల్యే (టిడిపి)



ఆరణి శ్రీనివాసులు
తిరుపతి ఎమ్మెల్యే (టిడిపి)



పులివర్తి నాని
చంద్రగిరి ఎమ్మెల్యే (టిడిపి)



పాశం సునీల్ కుమార్
గూడూరు ఎమ్మెల్యే (టిడిపి)



కోనేటి ఆదిమూలం
సత్యవేడు ఎమ్మెల్యే (టిడిపి)



బొజ్జల సుధీర్ రెడ్డి
శ్రీకాళహస్తి ఎమ్మెల్యే (టిడిపి)

'భూమన' రాజీనామా

ప్రజాశక్తి - తిరుమల: టిటిడి ఛైర్మన్ పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు తన రాజీనామాను ఆమోదించాలంటూ టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డికి లేఖను పంపారు. గత ఆగస్టు నెలలో టిటిడి ఛైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో రాజీనామా చేయడం గమనార్హం.

ప్రజాశక్తి
www.prajasakti.com
చిత్తూరు - తిరుపతి
బుధవారం 5 జూన్ 2024

చిత్తూరు టిడిపి ఎంపి దగ్గుమళ్ల ప్రభంజనం

- హోరాహోరీ పోరులో గురుమూర్తి విజయం
- చింతామోహన్‌కు 65,523
- తిరుపతిలో బిజెపి తిరస్కరణ

ప్రజాశక్తి - తిరుపతి

చిత్తూరు టిడిపి ఎంపి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు గెలుపు నల్లేరుపై నడకలా సాగింది.. తొలినుంచి ఆధిక్యత కొనసాగిస్తూ బంపర్ మెజార్టీ దక్కించుకున్నారు. దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు 7,78,071 ఓట్లు రాగా, వైసిపి ఎంపి అభ్యర్థి రెడ్డెప్ప (సిట్టింగ్)కు 557592 ఓట్లు వచ్చాయి. 2,20,479 ఓట్లు మెజార్టీ దక్కించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సైతం 30,150 ఓట్లు దక్కించుకున్నారు. 11,976 మంది నోటాకు నొక్కేశారు. ఇక తిరుపతి పార్లమెంట్ విషయానికి వస్తే కౌంటింగ్ హోరాహోరీగా ఉత్కంఠతో సాగింది. తొలుత వైసీపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి వెనుకబడ్డారు. తర్వాత ప్రతి రౌండ్లోనూ బీజేపీ వరప్రసాద్ హోరాహోరీ తలపడ్డారు. చివరకు గురుమూర్తికి 6,32,228 ఓట్లు దక్కాయి. సమీప ప్రత్యర్థి వరప్రసాద్ రావు 6,17,659 ఓట్లు సాధించారు. ఈక్రమంలో గురుమూర్తి 14,569 ఓట్లతో గట్టెక్కారు. ఉప ఎన్నికలో ఆయన 2,30,572 ఓట్ల ఆధిక్యతతో గెలవడం విశేషం. తిరుపతి ఎంపీగా డాక్టర్ గురుమూర్తి గెలవడం ఇది రెండవసారి. ఇక కేంద్రమంత్రిగా గతంలో కాంగ్రెస్ తరపున గెలుపొందిన చింతామోహన్ తక్కువ ఓట్లనే దక్కించుకుని మూడో స్థానంలో నిలిచారు. 65,523 ఓట్లు లభించాయి. తిరుపతిలో మైనార్టీలు బిజెపిని తిరస్కరించారన్నది వాస్తవం. అతి తక్కువ మెజార్టీతో అయినా వైసిపినే గెలుపొందింది. తిరుపతి ఎంపి పరిధిలో క్రాస్ ఓటింగ్ పనిచేసింది. తిరుపతి ఎంపి పరిధిలో 16,118 మంది నోటాకు ఓటేశారు.



చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు



తిరుపతి ఎంపి మిద్దెల గురుమూర్తి

'జగన్మోహనం'గా చిత్తూరు

ప్రజాశక్తి - తిరుపతి (చిత్తూరు)


అటు అధికార, ఇటు ప్రతిపక్ష అభ్యర్థులు ఇద్దరూ కొత్త వారైనప్పటికీ చిత్తూరు ప్రజలు మాత్రం ఈ దఫా జగన్మోహనంగా తీర్పునిచ్చారన్న చర్చ నడుస్తోంది. చిత్తూరు జిల్లాలో వైసిపికి పెద్ద ఆర్థికవనరుగా ఉన్న విజయానందరెడ్డిని అధికార పార్టీ బరిలోకి దింపి ఎలాగైనా గెలవాలని తన శక్తియుక్తుల్ని ఒడ్డింది. ఎన్నికలకు ఆర్నెళ్ల ముందునుంచే ధన, బల ప్రదర్శనలతో, తాయిలాలతో ప్రజల్ని ప్రలోభాలకు గురిచేసింది. ఇదే సందర్భంలో సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన తనను కాదని, విజయానందరెడ్డికి సీటు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరారు. ఆయన వర్గమూ వైసిపి అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసింది. వైసిపి అభ్యర్థికి ధీటుగా ఆర్థిక, కుల,బలగం ఉన్న గురజాల జగన్మోహన్‌ను తెలుగుదేశం సైతం రంగంలోకి దింపింది. దీంతో పార్టీలకతీతంగా తనకున్న పరిచయాలను విస్తృతంగా ఉపయోగించుకున్న టిడిపి అభ్యర్థి జనంలోకి దూసుకెళ్లారు. చిత్తూరులో తనకంటూ ఓ వర్గమున్న మాజీ ఎమ్మెల్యే సికెబాబును సైతం తమవైపుకు తిప్పుకోగలిగారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకుల్ని, కార్యకర్తల్ని అందరినీ ఏకతాటిపైకి తెచ్చి తన విజయం నల్లేరుపై నడకగా మార్చుకుని జగన్మోహన్ 88,066 ఓట్లు సాధించి, 14,604 మెజార్టీని సాధించారు. వైసిపి అభ్యర్థి విజయానందరెడ్డి 73,462కి ఓట్లు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.



బాబు... కంచు కోట 'కుప్పం'

ప్రజాశక్తి - తిరుపతి (కుప్పం)

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు కంచు కోట 'కుప్పం' అని మరోసారి రుజువైంది. ఇప్పటికే కుప్పం నుంచి గెలిచిన చంద్రబాబు మూడు పర్యాయాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. తాజాగా 2024లోనూ మరోసారి కుప్పం నుంచి గెలిచి నాలుగోసారి సిఎం పీఠంపై కూర్చోనున్నారు. ఈ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి కెఆర్‌జి భరత్‌పై 48,006 ఓట్ల ఆధిక్యతను సాధించి, 1,21,929 ఓట్లను కైవసం చేసుకున్నారు. భరత్‌కు 73,923 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే 1989 నుంచి వరుసగా 1994, 1999, 2004, 2009, 2014, 2019, 2024 ఎనిమిదో సారి గెలిచిన చంద్రబాబు రికార్డు సృష్టించి తనకు ఎదురులేదని మరోసారి చాటారు. 2019 తర్వాత కుప్పంపై పట్టు కోసం అటు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌లు తీవ్రంగా శ్రమించారు. బాబును ఓడించడమే లక్ష్యంగా వైసిపి అగ్రనేతలంతా పనిచేశారు. వైనాట్ 175 అంటూ కుప్పంపై ఫోకస్ పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దర్పాణ్ని చూపి వైసిపి ఏకగ్రీవాలను చేసి చర్చనీయాంశం చేసింది. కుప్పంలోనూ తామే గెలవబోతున్నామని నానా హంగామా చేసిన వైసిపి తీరా చేతులెత్తేసింది. చంద్రబాబు మాత్రం తన కంచుకోట నుంచే మరోసారి చక్రం తిప్పేందుకు సిద్ధమై ఎన్‌డిఎ కన్వీనర్‌గానూ పదవి చేపట్టబోతుండటం గమనార్హం.



పూతల 'పట్టు' దొరికింది

ప్రజాశక్తి- తిరుపతి, పూతలపట్టు

గ్రూపుల ఆధిపత్యధోరణితో విసుగుచెందిన ప్రజలు తొలిసారి అసెంబ్లీ బరిలోకి దిగిన టిడిపి అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ వైపు మొగ్గుచూపారు. అసంతృప్తితో ఉన్న వైసిపి శ్రేణుల్ని సైతం తమవైపు తిప్పుకోవడంతో విజయం సాధించారు. పైగా వర్గాలుగా ఉన్న టిడిపి శ్రేణుల్ని అందరినీ ఒకతాటిపైకి తీసుకొచ్చి, తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోవడంతో కలికిరి మురళీమోహన్ 1,02,137 ఓట్లు సాధించి, 15634 ఓట్ల మెజార్టీని కైవసం చేసుకున్నారు. వైసిపి అభ్యర్థి ఎం సునీల్‌కుమార్ కు 86,503 ఓట్లు రావడం గమనార్హం. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో ఏర్పడిన పూతలపట్టు నియోజకవర్గంలో ఎట్టకేలకు తెలుగుదేశం పార్టీకి పట్టు దొరికినట్లైంది. ఇప్పటి వరకు నాలుగుసార్లు నియోజకవర్గానికి ఎన్నికలు జరగ్గా 2009లో కాంగ్రెస్, 2014, 2019 లో వైసిపి గెలవగా ఈసారి మాత్రమే టిడిపి పార్టీ విజయం సాధించగలిగింది. ఎస్సీ రిజర్వుడ్ స్థానమైన పూతలపట్టులో గెలిచిన ఏ ఒక్కరికీ రెండోసారి అధికారానికి అవకాశం ఇవ్వకుండా పెత్తందారీతనాన్ని అగ్రవర్ణాల పెద్దలు చాటుకుంటుండటం శోచనీయం. పూతలపట్టులో 2009 నుంచి వరుసగా మూడు పర్యాయాలు టిడిపి అభ్యర్థిగా లలితకుమారి పోటీచేయడం, ఆమె విజయానికి అగ్రవర్ణాల పెద్దలు సహకరించకపోవడంతో ఓటమిని చవిచూడక తప్పలేదన్న చర్చ నడిచింది. ఆమెపై 2009లో కాంగ్రెస్ నుంచి డాక్టర్ రవి, 2014లో వైకాపా నుంచి సునీల్‌కుమార్, 2019లో ఎంఎస్ బాబులు పోటీచేసి విజయం సాధించారు. అయితే తొలినుంచీ నియోజకవర్గంపై గట్టిపట్టున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభ్యర్థి ఎంపిక నుంచీ గెలిపించుకోవడం వరకూ అన్నీ తానై వ్యవహరిస్తూ వచ్చారు. ఇదే తరుణంలో ' నేనెవరు చెబితే వారే ఎమ్మెల్యే అంటూ సిట్టింగ్ ఎమ్మెల్యేను పక్కన పెట్టి కొత్త వ్యక్తులను పోటీచేయించడం రివాజుగా మారింది. 2009లో గెలిచిన రవిని కాదని 2014లో సునీల్‌కుమార్ ను నిలబెట్టారు. 2019లో సునీల్‌కుమార్‌ను కాదని ఎంఎస్ బాబును పోటీచేయించారు. తీరా 2024 లోనూ కొత్తముఖాన్ని తెరపైకి తేవడంతో నియోజకవర్గమంతా తీవ్ర వ్యతిరేకత వెల్లుబికడమే కాకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగారు. దీంతో చేసేదిలేక మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌నే వైసిపి అభ్యర్థిగా బరిలోకి దించారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే లలితకుమారినీ పార్టీలో చేర్చుకుని మళ్లీ పూతలపట్టును కైవసం చేసుకోవాలని వైసిపి తీవ్రంగా శ్రమించింది.



ఆధిక్యం చాటుకున్న అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి (పలమనేరు)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న ఎన్ అమరనాథరెడ్డి పలమనేరులో ఈసారి తన ఆధిక్యాన్ని నిలుపుకోగలిగారు. టిడిపి ఆవిర్భావం నుంచి ఏడు సార్లు విజయం సాధించి కంచుకోటగా ఉన్న పలమనేరులో మరోసారి తెలుగుదేశం తన విజయపతాకం ఎగురవేసింది. తొలినుంచి రాజకీయ నేపథ్యం కలిగిన నూతనకాల్వ కుటుంబం నుంచి వచ్చిన అమర్నాథరెడ్డి 2019లో టిడిపి నుంచి పోటీచేసిన ఆయన వైసిపి అభ్యర్థి వెంకటేగౌడ చేతిలో ఓటమి చెందారు. అయితే ఇప్పుడు అదే ప్రత్యర్థిపై 20,122 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించి తన పట్టు నిలుపుకున్నారు. అయితే పెద్దిరెడ్డి సహకారం లేకపోయినప్పటికీ ' వైసిపి టికెట్ తన జేబులో ఉంది' అంటూ ధీమానే కాకుండా తాను ఖచ్చితంగా గెలుస్తానన్న అతి విశ్వాసంతో వెంకటేగౌడ ఆ పార్టీ నాయకుల్ని, కార్యకర్తల్ని నిర్లక్ష్యం చేశారన్న ప్రచారం జోరుగా సాగింది. ఫలితంగా వెంకటేగౌడకు 1,03,110 ఓట్లు రాగా, అమరనాథరెడ్డి 1,23, 232 ఓట్లతో విజయం సాధించారు. 2014లో పలమనేరు నుంచే వైసిపి అభ్యర్థిగా గెలిచి, తెలుగుదేశంలో చేరిన అమర్నాథరెడ్డి పరిశ్రమల శాఖామంత్రిగానూ పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం మళ్లీ ఎమ్మెల్యేగా గెలవడంతో సామాజిక సమీకరణల నేపథ్యంలో చంద్రబాబు కేబినెట్‌లో అవకాశం లభిస్తుందన్న చర్చ నడుస్తోంది. అమర్‌నాథరెడ్డి తండ్రి నూతనకాల్వ రామకృష్ణారెడ్డి సైతం పుంగనూరు నుంచి 3 సార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, ఒక సారి చిత్తూరు ఎంపీగా పనిచేశారు.



మూడో స్థానంలో ఇండియా ఫోరం

తిరుపతి (మంగళం) : తిరుపతి జిల్లాలో ఇండియా ఫోరం కాంగ్రెస్ అభ్యర్థులు మూడో స్థానంలో నిలిచారు. సూళ్లూరుపేటలో 4,124 ఓట్లు అత్యధికంగా వచ్చాయి. సత్యవేడులో 1264 ఓట్లు వచ్చాయి. మొత్తం ఆరు నియోజకవర్గాలు కలిపి 16,754 ఓట్లు లభించాయి. ఇక తిరుపతిలో ఇండియా ఫోరం అభ్యర్థిగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.మురళికి 600 ఓట్లు వచ్చాయి. చిత్తూరు జిల్లాలో నగరి కాంగ్రెస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి 4,551 ఓట్లు అత్యధికంగా వచ్చాయి. కుప్పం అభ్యర్థి గోవిందరాజులుకు 2,574 ఓట్లు వచ్చాయి. ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓట్లు 23,477 వచ్చాయి.

జిడి నెల్లూరులో థామస్ విజయఢంకా

ప్రజాశక్తి - తిరుపతి (వెదురుకుప్పం)

రిజర్వుడు స్థానమైన గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సాంప్రదాయకంగా వస్తున్న కాంగ్రెస్ ఓటర్లు ఈ దఫా టిడిపి వైపు మొగ్గుచూపి కూటమి అభ్యర్థి థామస్‌కు విజయాన్ని కట్టబెట్టారు. చెన్నైలో వైద్యునిగా ఉన్న ఆయన తొలిసారిగా పోటీచేసినప్పటికీ ఆయన విజయం వెనుక ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు, నారాయణస్వామిపై ఉన్న అసంతృప్తే కారణంగా తెలుస్తోంది. టిడిపి అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచీ ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడం, అటు ప్రత్యర్థి పార్టీ నాయకుల్నీ తనదైన శైలిలో ప్రసన్నం చేసుకోవడంలోనూ సఫలీకృతుడయ్యారు. వైసిపి నుంచి 2014, 2019లో గెలుపొంది జగన్ కేబినెట్‌లో డిప్యూటీ సిఎంగానూ పనిచేసిన కె నారాయణస్వామికి వ్యతిరేక పవనాలు వీయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన కుమార్తె కృపాలక్ష్మిని వైసిపి బరిలోకి దింపింది. అయినప్పటికీ ఓటర్లు మాత్రం థామస్ వైపే మొగ్గుచూపడం గమనార్హం. పునర్విభజనలో భాగంగా 2009 లో వేపంజేరి నుంచి జిడి నెల్లూరుగా ఏర్పడిన నియోజకర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన గుమ్మడి కుతూహలమ్మ, టిడిపి అభ్యర్థి గాంధీపై 10,826 ఓట్ల ఆధికత్యతో గెలుపొందారు. 2014లో టిడిపి అభ్యర్థిగా పోటీచేసిన కుతూహలమ్మపై, వైసిపి అభ్యర్థి కె నారాయణస్వామి 20,565 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019 టిడిపి అభ్యర్థి హరికృష్ణపై వైసిపి అభ్యర్థి కె నారాయణస్వామి 45,594 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించి జగన్ కేబినెట్‌లో సేవలందించినా 2024లో పోటీ చేసేందుకు వెనుకంజవేయడం గమనార్హం.ఆయన వారసురాలిగా తెరపైకి వచ్చిన కృపాలక్ష్మి, టిడిపి అభ్యర్థి థామస్ చేతిలో 26,011 ఓట్ల తేడాతో ఓటమిపాలైంది. టిడిపి అభ్యర్థి థామస్ కు 1,01,176 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి కె కృపాలక్ష్మి 75,165 ఓట్లతో సరిపెట్టుకుంది.

నగరి 'గాలి' మళ్లింది

ప్రజాశక్తి - తిరుపతి (నగరి) : నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే మంత్రి రోజాకు ఈ ఎన్నికలు తీవ్ర శృంగభంగాన్ని మిగిల్చింది. గతంలో రోజాను గెలిపించనవారే..ఆమె తీరు నచ్చకపోవడంతో తిరుగుబాటు చేశారు. ఈసారి ఆమెకు టికెట్ ఇస్తే తామే ఓడిస్తామంటూ ప్రకటించడమే కాకుండా ఎట్టకేలకు ఓటమికి శాయశక్తులా కృషిచేశారు. సొంత పార్టీ నాయకుల్లోనే తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ వైసిపి అధిష్టానం నుంచి టికెట్‌ను సాధించుకున్నా స్వయంకృతాపరాధంతో ఘోరపరాజయాన్ని ఎదుర్కోకతప్పలేదు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన టిడిపి సీనియర్ నేత గాలిముద్దుకృష్ణమ నాయుడిపై 2014లో తొలిసారి గెలిచి అసెంబ్లీకి వెళ్లిన ఆర్‌కె రోజా వైసిపి ఫైర్‌బ్రాండ్‌గా మారారు. 2019 ఎన్నికల్లోనూ గాలి ముద్దుకృష్ణమనాయుడు తనయుడు గాలిభానుప్రకాష్‌పై 2 వేల ఓట్లతో విజయం సాధించి జగన్ కేబినెట్‌లో మంత్రిగా ఛాన్స్‌కొట్టేశారు. అయితే నియోజకవర్గంలో ఆమె సోదరులు, భర్త పెత్తనం ఎక్కువైందని, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, ఆఖరికి సొంత పార్టీ నాయకుల నుంచీ కమీషన్లు వసూళ్లు చేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఇదేమీ పట్టని రోజా ప్రశ్నించిన వారిపై కక్ష పూరితంగా వ్యవహరించడం, నోటిదురుసుతో కార్యకర్తల్ని, నాయకుల్ని దూరం చేసుకుంది. దీనికితోడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పెరిగిన వైరం కాస్తా టిడిపికి లాభించిందని చెప్పక తప్పదు. ఇదే సందర్భంలో దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న టిడిపి అభ్యర్థి గాలిభానుప్రకాష్ ప్రత్యర్థి పార్టీ నేతల్ని సైతం తమ వైపుకు తిప్పుకోవడంతో సఫలీకృతమయ్యారు. వైసిపి అభ్యర్థి ఆర్‌కె రోజా 62,793 ఓట్లు సాధించగా, గాలి భానుప్రకాష్ 1,07,797 ఓట్లు పొంది 45,006 మెజార్టీని సాధించారు.



తిరుపతి జిల్లా టీడీపీ కూటమి క్లీన్ స్వీప్

- ఏడు స్థానాల్లోనూ వైసీపీకి పరాభవం
- జనసేన ఆరణికి 62వేల ఆధిక్యం
- ఆదిమూలంకు 3,739 మెజార్టీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి క్లీన్ స్వీప్ చేసింది. ఏడు శాసనసభ స్థానాల్లోనూ వైసీపీకి పరాభవం ఎదురైంది. గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. తిరుపతి నగరం శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ప్రాంగణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ కేంద్రంలో తిరుపతి జిల్లా పరిధిలోని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల ఓట్లు లెక్కించారు. ఇందులో మొదటి రౌండ్ నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. గూడూరులో పాశం సునీల్ కుమార్ (టీడీపీ)కి 1,02,675 ఓట్లు రాగా... వైసీపీ అభ్యర్థి మేరుగ మురళీధర్ కు 81,483 ఓట్లు వచ్చాయి. ఇక్కడ పాశం సునీల్ కుమార్ 21,192 ఓట్లుతో గెలుపొందారు. సూళ్లూరుపేటలో నెలవల విజయశ్రీ (టీడీపీ)కి 1,11,048 ఓట్లు రాగా... వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యకు 81,933 ఓట్లు వచ్చాయి. విజయశ్రీ 29,115 మెజార్టీలో గెలుపొందారు. వెంకటగిరిలో కురుగొండ్ల రామకష్ణ (టీడీపీ)కి 1,04,398 ఓట్లు రాగా... వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రాం కుమార్ రెడ్డికి 88,104 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కురుగొండ్ల రామకష్ణ 16,294ఓట్లు మెజార్టీతో గెలిచారు. చంద్రగిరిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని)కి 1,43,667 ఓట్లు రాగా... వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి 99,815 ఓట్లు వచ్చాయి. ఇక్కడ పులివర్తి నాని 43,852 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు 1,10,533ఓట్లు రాగా... వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ కు 53,437ఓట్లు వచ్చాయి. ఇక్కడ ఆరణి శ్రీనివాసులు 57,096 ఓట్లుతో గెలుపొందారు. తిరుపతి జిల్లాలో ఇదే అత్యధిక మెజార్టీ. ఇక శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి 1,21,565 ఓట్లు రాగా... వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డికి 78,261 ఓట్లు వచ్చాయి. ఇక్కడ బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి 43,304 ఓట్లు మెజార్టీతో గెలిచారు. సత్యవేడులో టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం కు 85,471ఓట్లు రాగా... వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ కు 81,732 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కోనేటి ఆదిమూలం 3,739 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. తిరుపతి జిల్లాలో ఇదే అతి తక్కువ మెజార్టీ. ఎన్నడూ లేని విధంగా తిరుపతి జిల్లాలో టీడీపీ కూటమి క్లీన్ స్వీప్ చేయడంతో ఆ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

'నోటా'నూ తక్కేవేం కాదు..!

ప్రజాశక్తి - తిరుపతి: 'పై అభ్యర్థులు ఎవరూ మాకొద్దు' అంటూ పెద్ద సంఖ్యలోనే ఓటర్లు తిరస్కరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పరిశీలిస్తే గూడూరులో 3,119 మంది నోటాకు ఓటేశారు. అత్యల్పంగా సత్యవేడులో 773 పడ్డాయి. తిరుపతి జిల్లాలో 13,482 మంది నోటాకు ఓటేశారు. చిత్తూరు జిల్లాలో 13,748 మంది నోటాకు సై అన్నారు.

బంగారుపాళ్యంలో భారీ వర్షం



ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: బంగారుపాళ్యం మండలంలో మంగళవా రం సాయంత్రం భారీ వర్షం కురిసింది. నాలుగు గంటల నుంచి ఆరున్నర వరకు వర్షం పడుతూ రోడ్లంతా జలమయమయ్యాయి. రుతుపవనాలు రావడం పట్ల వర్షాలు పడుతున్నాయని రైతులకు వేరుశనగ పంటకు అనువైనదని పలువు రైతులు తెలుపుతున్నారు.

గెలిచిన అభ్యర్థులకు అభినందనలు: వేంకటే గౌడ



ప్రజాశక్తి-పలమనేరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో గెలుపొందిన అభ్యర్థులకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అభినందనలు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన అమర్నాథ్ రెడ్డికి, చంద్రబాబునాయుడుకి అభినందనలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తూ, తన ఓటమిని అంగీకరిస్తూ గతంలో లాగా, రాబోవు 5 ఏళ్ల పాటు ప్రజల కోసం పాటుపడతానని, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. తనకు ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

చిత్తూరులో అల్లర్లు

- వైసీపీ అనుచరుల వ్యాపార సంస్థపై దాడులు



అల్లరిమూకల దాడిలో పాక్షికంగా దెబ్బతిన్న తిరుమలబేకరి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: టిడిపి అనూహ్య విజయం తరువాత చిత్తూరులో అల్లర్లు చోటు చేసుకున్నాయి. వైసీపీ అభ్యర్థి విజయం కోసం కృషి చేసిన ఎంసి విజయానందరెడ్డి అనుచరుల దుకాణాలపై దాడులు జరిగాయి. రాష్ట్రంలో టిడిపి హవా, చిత్తూరులో టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్ విజయం సాధించిన తరువాత చర్చివీధిలోని తిరుమల బేకరిపై అల్లరి మూకలు దాడిచేశారు. వైసీపీ అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి అనుచరులు ప్రసన్నకుమార్ చికెన్ సెంటర్‌పై దాడి జరిగింది. ఈ అల్లర్లపై కేసునమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్చరిక..



ప్రజాశక్తి-వెదురుకుప్పం: 144 సెక్షన్, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మండలంలో ఎవ్వరూ ఎలాంటి సంబరాలు, టపాసులు పేల్చుట నిషేదం అని ఎస్ఐ శేషగిరి రావు అన్నారు. మంగళవారం మండలంలోని పచ్చికాపల్లంలో వెదురుకుప్పం తమ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ గుడికూడిన జనంతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ బుధవారం ఉదయం 6గంటల వరకు అమల్లో ఉంటుందన్నారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలన్నారు. కాదని వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సూర్య, చంద్రప్రభలపై వేణుగోపాలుడి విహారం

ప్రజాశక్తి-కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సంతాన వేణుగోపాలుడు పశు పాలకుడైన శ్రీకృష్ణునిగా.. జీవకోటికి వెలుగును ప్రసాదించే దినకరుడిపై విహరించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. ఉదయం 5గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు, ఆస్థానం, గంట తదితర కార్యక్రమాలను టీటీడీ అర్చకులు పూర్తి చేశారు. అనంతరం వేణుగోపాలుడు సూర్యప్రభ వాహనంపై స్వర్ణాభరాలు, సుగంధ పుష్పాలు, పట్టుపీతాంబరాలతో అలంకరించి శ్రీకృష్ణునిగా భక్తులను అనుగ్రహించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్ల సమర్పణ అనంతరం అర్చకులు స్వామివారికి దీప, ధూప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30గంటలకు ఆలయ ఆవరణంలో ఉన్న ఊంజల్ మండపంలో స్వామివారని కొలుదీర్చి అన్నమయ్య సంకీర్తనలతో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో గోవిందనామ

భారీగా తరలి వచ్చిన భక్తజనం

స్మరణాలు, భజనలు, కోలాటాలు, గ్రామీణ సంప్రదాయ వాయిద్యాల మధ్య ఊరేగారు. భక్తులు ఇంటింట కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణ భట్టార్ నారాయణం దాసరి, వేదపండితులు గోపాలాచారి, తరుణ్‌కుమార్, ఆలంకార భటులు, టీటీడీ ఆలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం సంతాన వేణుగోపాలుడు ఉభయ దేవేరులతో రథంపై ఊరేగనున్నారు. ఉదయం 7.25గంటల నుంచి 9.30వరకు మాడవీధులు, మండపం వీధి, బజారువీధి, తూర్పు వీధి, బ్రాహ్మణ



వీధుల మీదుగా రథ యాత్ర కొన సాగనుంది. భక్తుల కర్పూర నీరాజనాలు అందుకుంటూ స్వామివారు ముందుకు సాగనున్నారని ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అదే విధంగా సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రికి స్వామి వారు అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగుతారని తెలిపారు.

టీడీపీ అభ్యర్థి విజయం.. నేతల సంబరాలు



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ జీడీ నెల్లూరు అభ్యర్థి డాక్టర్ థామస్ ఘన విజయం సాధించారు. 28వేలకు పైచిలుకు ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మంగళవారం ఫలితాలు వెలువడడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక గ్రామదేవతలకు పూజలు చేసి టపాకాయలు పేల్చి కేకులు కట్ చేశారు. మండల కేంద్రంలో నాయకులు జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, సూరిరెడ్డి, నవీన్, అజిత్, సాయి కిరణ్, సతీష్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో

ప్రజాశక్తి-రామకుప్పం:



సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఘనవిజయం సాధించినందుకు రామకుప్పంలో కూటమి నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ప్రధానంగా కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గత 35సంవత్సరాల నుంచి చంద్రబాబు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసినందుకు అభిమానంతో ప్రజలు ఘనవిజయం అందించారన్నారు. గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాలను మళ్లీ ప్రజలకు అందించాలని టిడిపికి పట్టం కట్టారన్నారు. ఏ ఎన్నికలలోను చూడనంత వైసిపి ఘోర పరాజయం అయ్యేందుకు ఏ ఒక్క అభివృద్ధి రాష్ట్రంలో చేయలేదన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్ థామస్ రాకతో.. కొత్తపల్లి మిట్టలో సంబరాలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ కొత్తపల్లిమిట్ట వాణిజ్య కూడలిలో మంగళవారం రాత్రి మండల పార్టీ అధ్యక్షులు జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ థామస్ గెలుపుతో 49కొత్తపల్లి మిట్టలో తెలుగు తమ్ముళ్లతో కలిసి సంబరాలు చేసుకున్నారు. బాణాసంచాలు పేల్చి భారీ కేక్ కట్ చేసి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాట గంగమ్మ ఆలయంలో పూజలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో పలమనేరు నియోజకవర్గంలోని కూటమి అభ్యర్థి అమర్నాథ్ రెడ్డి విజయం సాధించారు. ఈ సందర్భంగా



బైరెడ్డిపల్లిలో


మండలంలోని బాట గంగమ్మ గుడి వద్ద మండలంలోని తెలుగు తమ్ముళ్లు ప్రత్యేకంగా పూజలు నిర్వహించిన అనంతరం పార్టీ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, మాజీ జెడ్పిటిసి రాధా, మాజీ ఎంపీపి కృష్ణవేణి, విజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం శెట్టి వారికి మండల శ్రేణులు స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అరాచకాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. టీడీపీ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతఘ్నుతలు తెలిపారు. కార్యక్రమంలో జయకుమార్, సాయి ప్రతాప్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు.. తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి-పలమనేరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్, పోలీస్ ఆక్ట్ 30అమల్లో ఉన్నందువలన పలమనేరు పట్టణంలో దుకాణాలు బంద్ పాటించారు. దీంతో పట్టణ ప్రాంతంలో దుకాణాలు, టీ కొట్టులు, హోటళ్లు ముతబడ్డాయి. కనీసం వాటర్ బాటిల్ తీసుకోవడానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ చంద్రశేఖర్ పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

మురళిమోహన్‌కు గల్లా శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఐరాల: టీడీపీ పూతలపట్టు ఎమ్మెల్యేగా విజయం సాధించిన కలికిరి మురళిమోహన్‌కు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విజయం సాధించిన మురళిమోహన్ గల్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర టిఎన్టియూసీ కార్యనిర్వాహక కార్యదర్శి యువరాజుల నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మిద్దింటి మోహన్ నాయుడు, గంగారపు హరిబాబు నాయుడు పాల్గొన్నారు.



తిరుపతి పార్లమెంట్‌లో కూటమి అభ్యర్థికే పోస్టల్ బ్యాలెట్లు

- వైసిపి పట్ల వ్యతిరేకత చాటిన ఉద్యోగులు

ప్రజాశక్తి తిరుపతి టౌన్

ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎన్నికల అధికారులు పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వైసీపీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోవడంతో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి వరప్రసాదరావుకు 9,165ఓట్లు వచ్చాయి. వైసీపీ తిరుపతి ఎంపీ అభ్యర్థిగా గెలిచిన డాక్టర్ గురుమూర్తికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 5526ఓట్లు వచ్చాయి కాంగ్రెస్ ఎంపీటీసీ డాక్టర్ చింతామణికు 1733ఓట్లు పడ్డాయి నోటాకు 209ఓట్లు పడ్డాయి. మొత్తం పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు 17వేల 212ఓట్లు ఉద్యోగులు వేశారు.

'మహిళ ఓట్లతోనే టిడిపి విజయం'

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: మహిళ ఓట్ల శాతంతోనే తెలుగుదేశం విజయం సాధించిందని సర్పంచుల జిల్లా అధ్యక్షులు కోక ప్రకాష్ నాయుడు అన్నారు. మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు మహిళలను ఎంతో ఆకట్టుకున్నదని ఓటింగ్ శాతంలో మహిళలు అధిక శాతంలో పాల్గొనడానికి కారణమైందన్నారు.

ఓట్లు రాలని 'భూమన' అభివృద్ధి మంత్రం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తన వారసునిగా భూమన అభినయ్‌రెడ్డికి తిరుపతి ఎంఎల్ఎ సీటు ఇవ్వాలని అడిగి మరీ తీసుకున్న భూమన కరుణాకర్‌రెడ్డి ఇంటా ఆనంద పవనాలు వీయలేదు. చివరి ఆరు నెలల్లో తిరుపతిపై వేసిన అభివృద్ధి మంత్రం పనిచేయలేదు. టిటిడి ఛైర్మన్‌గానూ, డిప్యూటీ మేయర్‌గానూ భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డిలు అభివృద్ధి, సంక్షేమం తమకు ఓట్లు తెచ్చి పెడతాయని ఊహించారు. అయితే వారి ఆశలు నెరవేరలేదు. 'కమీషన్ల' పేరుతో ఒత్తిడి సొంత పార్టీలోనే వ్యతిరేకత ఉందని చర్చ నడిచింది. చిత్తూరు వైసిపి నుంచి జనసేనలోకి జంప్ అయి తిరుపతిలో పోటీచేసిన ఆరణి శ్రీనివాసులును తక్కువ అంచనా వేశారనే చెప్పాలి. తిరగకపోయినా గెలిచిపోతామని తొలుత అనుకున్నారు. అయితే బలిజ, యాదవ సామాజికవర్గాలు 'జనసేన'కు బాగా పనిచేశాయన్నది వాస్తవం.

హోరాహోరీ పోరులో ఆదిమూలం గెలుపు


ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికలు వైసిపి, టిడిపి మధ్య హోరాహోరీ పోరు సాగింది. స్వల్ప మెజారిటీ దిశగా తొలి రౌండ్ నుంచి నుంచి టిడిపి అభ్యర్థి ఆదిమూలం సాధిస్తూ వచ్చారు. మధ్యలో కొన్ని రౌండ్లలో వైసిపి అభ్యర్థి నూక తోటి రాజేష్ కు మెజార్టీ కనిపించినా చివరకు ఆదిమూలం గెలుపొందారు. ఎన్నికల్లో ఆదిమూలంకు పోస్టల్ బ్యాలెట్ తో కలిపి 3,739 ఓట్ల మెజార్టీతో విజయ దుందుభి మోగించారు.కోనేటి ఆదిమూలం వైసిపి ని ధిక్కరించి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు తెచ్చుకున్న ప్రారంభంలో సీటు ఆశించి భంగపడిన స్థానిక టిడిపి నాయకులు తనను వ్యతిరేకించినప్పటికీ వారందరితో చర్చలు జరిపి అందరి కలుపుకొని సమిష్టిగా ప్రచారం చేయడం వల్లనే విజయం సాధ్యమైందని విశ్లేషకుల అంచనా. స్థానికుడు కావడం అధికార పార్టీపై ప్రజలలో వ్యతిరేకత వంటి కలిసొచ్చే అంశాలు విజయానికి దోహదపడ్డాయి.

ప్రజాభీష్టం మేరకు నడుచుకుంటా..

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


తిరుపతి ఎమ్మెల్యేగా ధృవీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తన గెలుపు ప్రజా విజయం అని, ప్రజాభీష్టం మేరకు నడుచుకుంటానని జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తిరుపతి ప్రజలు పవన్ కళ్యాణ్ కు తనను గెలిపించి గిఫ్ట్ గా ఇచ్చారని ఆయన తెలిపారు. తిరుపతి లోనే నివాసం ఉండి అందరికి అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి తిరుపతి ఎమ్మెల్యేగా రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ నుంచి డిక్లరేషన్‌ను ఆరణి శ్రీనివాసుల స్వీకరించారు. డిక్లరేషన్ తీసుకున్న అనంతరం మీడియాతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌లు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలో సుమారు 63వేల ఓట్లతో గెలిపించిన తిరుపతి ప్రజలకి రుణపడి ఉంటానన్నారు. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన పవన్ కళ్యాణ్‌కు, చంద్రబాబు, మోడీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అహంకారుల పాలన నుంచి తిరుపతి ప్రజలకు విముక్తి లభించిందని ఆరణి శ్రీనివాసులు అన్నారు. తిరుపతిలోనే నివాసం ఉంటానని మరోసారి ఆయన స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, చంద్రబాబు నాయుడు అనుభవంకు తోడు నరేంద్ర మోడీ సహకారంతో తిరుపతిని అన్ని రంగాల్లో ముందు నిలిపేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వి ప్రసాద్, డాక్టర్ హరిప్రసాద్, ఆర్‌సి మునికృష్ణ, ఊక విజయ్ కుమార్, నర్సింహులు నాయుడు, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్, గాలి నందా పాల్గొన్నారు.


ధృవీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న నెలవల విజయశ్రీ

వారసుల్లో వైసిపికి ఖేదం... టిడిపికి మోదం..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: వారసులుగా ఎన్నికల బరిలో దిగిన వారికి వైసిపిలో ఖేదం మిగల్చగా, టిడిపిలో మోదం కలిగింది. శ్రీకాళహస్తి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వారసునిగా బొజ్జల సుధీర్‌రెడ్డి, నగరి గాలి భానుప్రకాష్‌రెడ్డి వారసుడు గాలి భానుప్రకాష్, సూళ్లూరుపేట నేదురుమల్లి విజయశ్రీ భారీ మెజార్టీతో గెలుపొందారు. అయితే తిరుపతి భూమన కరుణాకర్‌రెడ్డి వారసుడు భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కొడుకు మోహిత్‌రెడ్డి ఓటమిని చవి చూడాల్సి వచ్చింది.

ఏకైక మహిళా ఎంఎల్‌ఎ నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేటలో.. టిడిపి అభ్యర్థి నెలవల విజయశ్రీ ఘన విజయం సాధించారు. వైసిపి అభ్యర్థి సంజీవయ్యపై 29,115 ఆధిక్యతతో గెలుపొందారు. విజయశ్రీకి 1,11,048 ఓట్లు రాగా, సంజీవయ్యకు 81,933 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి చందనమూడి శివకు 4,124 ఓట్లు వచ్చాయి. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి ఏకైక మహిళా ఎంఎల్‌ఏగా ఆమె అసెంబ్లీలోకి తొలిసారి అడుగు పెట్టనున్నారు.

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఇప్పటికే టిడిపి 135కు పైగా నియోజక వర్గాలలో ఆధిక్యం సాధిస్తుండడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. తిరుపతి టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నరసింహయాదవ్, పనబాక లక్ష్మి, శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కర్పూర హారతులు ఇచ్చి గుమ్మడికాయ కొట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సంబరాలు చేసుకున్నారు.


గూడూరులో బిర్యాని బాక్సులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

గూడూరు టౌన్ : గూడూరు టీడీపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో గూడూరు పట్టణం లోని రైతు బజార్‌లో రైతు బజార్ కమిటీ ఆధ్వర్యంలో బిరియాని బాక్సులు పంచి పెట్టారు. ఈ సందర్భంగా రైతు బజార్ కార్యదర్శి మనపాటి శ్రీనివాసులు మాట్లా డుతూ టిడిపి హయాంలోనే రైతు బజారు ఏర్పాటయ్యాయని తెలిపారు. రైతు బజారు వల్ల ఎంతో మంది జీవనం సాగిస్తున్నారన్నారు. టిడిపి విజయం ఆనందంగా ఉందన్నారు. అనంతరం 150 మందికి బిరియాని బాక్సు లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బజారు అధ్యక్షుడు జోగి శివ కుమార్, మల్లి కార్జున్ నాయుడు, షబ్బీర్ బాషా, రమణమ్మ, సుబ్రమణ్యం, పెంచలమ్మ , నాగమ్మ, ప్రమీల పాల్గొన్నారు.


వరదయ్యపాలెంలో


వరదయ్యపాలెం: టిడిపి ఘన విజయంతో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక బస్టాండ్ ఆవరణలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కన్వీనర్ నవాబ్ మాట్లాడుతూ రాక్షస పాలనకు చరమగీతం పాడేలా ఓటర్లు వ్యవహరించిన తీరు దేశానికి ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ అధ్యక్షుడు చలపతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్, టిడిపి ప్రధాన కార్యదర్శి దశరథన్, తెలుగు యువత నాయకులు మహేష్, సలావుద్దీన్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : సార్వత్రిక ఎన్నికల్లో లోకల్ అభ్యర్థి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ ఘన విజయం సాధించడంతో గూడూరు నియోజక వర్గంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


పుత్తూరులో

పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అత్యధిక మెజారిటీతో గెలవడంతో పుత్తూరు టిడిపి నాయకులు, స్థానిక పుత్తూరు సదాశివ ఆలయం వద్ద 101 ఒక్క టెంకాయలు కొట్టి మొక్కు బడులు తీర్చుకున్నారు. ఆనందంతో గంతులు వేసి పార్టీ కార్యాలయం వద్ద ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకొని అభినందనలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, విక్కీ రాయల్, అశోక్, యువకులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిక: ఆదిమూలం గెలుపుతో మండలంలోని కారణమెట్టలో టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. చిన్నాయగుంట పంచాయతీలో టిడిపి పంచాయతీ కార్యదర్శి యనమల మురళి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాయకులు సంబరాలు జరుపుకున్నారు.


ఎస్‌సివినాయుడు ఆధ్వర్యంలో

శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రజలు తెలివైనవారని, ఎగిరెగిరిపడ్డ వైసిపి నాయకులకు కర్ర కాల్చి వాత పెట్టారని మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు అన్నారు. స్థానిక ఎస్‌సివి నివాసంలో మంగళవారం ఆయన ఎన్నికల ఫలితాలపై మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టినా ఓటింగ్ నాడు సరైన వేటు వేశారని ఎద్దేవా చేశారు. అనంతరం కూటమి గెలుపుపై కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.



శ్రీకాళహస్తిలో

శ్రీకాళహస్తి: ఎన్డీఏ కూటమికి రాష్ట్ర ప్రజలు అధికారాన్ని కట్టబెట్టడం విచక్షణతో కూడిన విలక్షణ తీర్పు అని జనసేన జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ అన్నారు. కూటమి విజయం పట్ల కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కూటమి లో గెలుపొందిన ప్రతి ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్రాపురం: చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) అఖండ మెజారిటీతో విజయం సాధించడంతో చంద్రగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు బాణాసంచా పేల్చి 'జై తెలుగుదేశం, జై చంద్రబాబు నాయుడు, జై జై పులివర్తి నాని'అంటూ నినాదాలతో డప్పులు వాయిస్తూ చిందులు వేసి సంబరాలు చేసుకున్నారు. చంద్రగిరిలో వి సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్ బాషా, ఐతేపల్లి పల్లిలో ఏవి రమణ, ఎల్లప్ప రెడ్డి, చానంపట్లలో గుడిపల్లి సురేష్ రెడ్డి నాయకులు సంబరాలు చేసుకున్నారు.

తిరుపతి రూరల్‌లో: పులివర్తి నాని గెలుపుతో డాలర్ దివాకర్ రెడ్డి, ఏ ఈశ్వర్ రెడ్డి, కత్తి సుధాకర్‌లు, పుదీపట్లలో బడి సుధా యాదవ్, ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు సంబరాల్లో పాల్గొన్నారు. తుమ్మలగుంటలో బిరుదుల భాస్కర్ రెడ్డి, దొడ్ల కరుణాకర్ రెడ్డి అయ్యప్ప, కృష్ణమూర్తి రెడ్డి, చెరుకూరి పరంధాం యాదవ్, ముని కృష్ణారెడ్డి, ఢిల్లీ యాదవ్‌లు సంబరాలు చేసుకున్నారు.

రామచంద్రాపురంలో: అనుపలికి గ్రామానికి చెందిన డి బిందు మాధవి, ముని రాజా, రూపు రాయల్, మధుసూదన్, శేఖర్, గ్రామస్తులు గ్రామ దేవత సత్యమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలో వెతుకుపో, బలిజపల్లి, తాటిమాకుల కండ్రిగ, రామచంద్రపురం, సి రామాపురం, వెంకట రామాపురం, సొరకాయల పాల్యం, రాయల చెరువు, ఎన్‌ఆర్ కమ్మపల్లి, కమ్మపల్లి, రావిళ్ళ వారి పల్లి. కమ్మ కండ్రిగ, గంగిరెడ్డిపల్లి గ్రామాలలో టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం తిరుమలరెడ్డి, సి జనార్దన్ చౌదరి, ముద్దు కృష్ణారెడ్డి, బాబు యాదవ్, లీలా మోహన్ నాయుడు, పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, రామిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): మంగళంలోని 27 పోలింగ్ బూత్‌లలో టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గెలుపొందడంతో స్థానిక టిడిపి నాయకులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

కూటమి సహకారం, కార్యకర్తల కృషి ఫలించింది..

- నా గెలుపు ప్రజలకు అంకితం - ఎమ్మెల్యే పులివర్తి నాని


ధృవీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గంలో తన గెలుపు ప్రజలకు అంకితమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పై 43,396 ఓట్ల భారీ మెజార్టీ తో గెలుపొందారు. బుధవారం కౌంటింగ్ ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ 1994లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి నారా రామ్మూర్తి నాయుడు గెలుపొందారన్నారు. 2024 ఎన్నికల్లో 30 ఏళ్ల చరిత్రను తిరగరాశామని వ్యాఖ్యానించారు. 43,852 వేల ఓట్లు రికార్డు మెజార్టీ అందించిన చంద్రగిరి ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నా నన్నారు. కూటమి సహకారం, కార్యకర్తల కృషి ఫలితమే తన గెలుపునకు ప్రధాన కారణమని స్పష్టం చేశారు. ఈ గెలుపును చంద్ర బాబుకు కానుకగా అందిస్తు న్నానని ప్రకటించారు. తన గెలుపులో భాగస్వా మ్య మైన నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు, శ్రేయోభిలాషులు, తన వెంటే ఉంటూ తనను ఆదరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. చంద్ర బా బు ఆశీస్సులతో, నారా లోకేష్ సహకారంతో నియోజక వర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని వెల్లడిం చారు. కక్షపూరితమైన రాజకీయాలకు తావు లేకుం డా, కుల, మత,వర్గ తారతమ్యాలు లేకుండా అభివృ ద్ధే ఏకైక అజెండాగా పనిచేస్తానని పేర్కొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న రాయలసీమ రంగస్థలి యాంకర్



ప్రజాశక్తి - తిరుపతి: తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర జరిగిన రెండవ మంగళవారం రాయలసీమ రంగస్థల ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి సారథ్యంలో కళాకారులు గంగమ్మను దర్శించుకున్నారు. శ్రీరాముడు, హనుమంతుడు, శ్రీకృష్ణదేవరాయలు, కర్ణుడు, దుర్యోధనుడు, శివుడు, అల్లూరి సీతారామ రాజు, శ్రీకృష్ణుడు వంటి వివిధ పౌరాణిక వేషధారణలతో వున్న టిటిడి ఉద్యోగి కృష్ణమూర్తి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, ఎం బ్రహ్మానందం రెడ్డి, కస్పా పద్మనాభం, బి వేణుగోపాల్, ఈ గుణశేఖర్, భాస్కర్ ఆచారి, మురళి, బి.చంగారెడ్డి, కవిత, పద్మావతి, మాధవి, ధనమ్మ, వివిధ వేషధారణలతో అమ్మవారిని దర్శించు కున్నారు. కాగా వీరి వేషధారణలు భక్తులను అలరించాయి. ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా తిరుపతి గంగమ్మ ఆలయ ఈవో మమత మాట్లాడుతూ రాయలసీమ రంగస్థల కళాకారులను అభినందించారు. పౌరాణిక వేషాలతో నేటి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని కళాకారులను కొనియాడారు. అనంతరం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి నిర్వహణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచారు. ఈ కార్యక్రమంలో మేకప్ మ్యాన్ మేకల కోదండపాణి, గంగయ్య, కార్యదర్శి కే ఎన్ రాజా పాల్గొన్నారు.

ఇది అసలైన ప్రజా తీర్పు

- గాలి మురళీనాయుడు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడి చంద్రన్న పాలనకు అంకురార్పణ చేయడంలో రాష్ట్ర ప్రజలు అసలైన అంతిమ తీర్పు నిచ్చారని టిడిపి తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళీ నాయుడు కొనియాడారు. మంగళవారం వెల్లడైన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఘన విజయం సాధించడం పట్ల గాలి మురళీనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి విధ్వంసక పాలన కారణంగా విసిగిన ప్రజలు జగన్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా చేశారని ఎద్దేవా చేశారు. ఇది ప్రజా విజయమని, ఈ గెలుపుతో టిడిపి నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడాలని పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

తిరుపతిలో పలు షాపులు బంద్

ఫలితాల వేళ రోడ్లు వెలవెల

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించారు. నగరంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు మోహరించారు. కౌంటింగ్ వేళ ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తుగా మంగళవారం పలు ప్రాంతాల్లో షాపులు బంద్ చేశారు. కౌంటింగ్ సందర్భంగా ప్రజలు సైతం టీవీలకు అతుక్కు పోవడంతో తిరుపతి నగరంలో చాలా ప్రాంతాలు జనం లేక వెలవెల పోయాయి. ఒక దశలో బంద్ వాతావరణం కనిపించింది. నగరంలో మూడు రోజుల పాటు మద్యపానం, అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు ఇవ్వడంతో బ్రాందీ షాపులు మూసివేశారు. చాలా మంది ముందు గానే మద్యం ప్రియులు మద్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతా లకు వాటిని తరలించి కావలసిన వారికి అందించారు. సాయంత్రం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు ఖాయమని తేలడంతో నగరంలో పలు చోట్ల కొంత మంది టిడిపి, జనసేన, బిజెపి నాయకులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ సాయంత్రం నగరంలో ఎన్టీఆర్ కూడలి వద్ద కేక్ కట్ చేయాలని నిర్ణయించి టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు రాకపోవడంతో విరమించుకున్నారు. తిరుపతిలో 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ఎలాంటి సంబరాలు చేసుకోకూడదని పోలీసులు తెలపడంతో వాయిదా వేసుకున్నారు.

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతం

తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్, ఎస్పీ హర్ష వర్ధన్ రాజు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంతంగా నిర్వహిం చడా నికి సహకరించిన ప్రతి ఒక్కరికి, అభ్యర్థులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల విధులలో పాల్గొని సహకరించిన అధికా రులకు, మీడియా ప్రతిని ధులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటు న్నానని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నా రు. మంగళవారం రాత్రి కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు, ఒక పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంత వాతావరణంలో పూర్తి అయిందని ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈసిఐ వెబ్సైట్‌లో ఎన్కోర్ లో డేటా అప్లోడ్ చేశామని, గొప్ప ఎన్నికల ప్రక్రియ నిర్వహించామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి రెండు రోజులు వుంటుందన్నారు.

కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగిన అభినయ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:
పద్మావతి మహిళా యూనివర్సి టీలో ఎన్నికల కౌంటింగ్ అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే అభ్యర్థులు ఏజెంట్లు భారీగా తరలి వచ్చారు. ఉదయం ఎనిమిది గంట లకు ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్లు తర్వాత 9 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభించారు. ఐదో రౌండ్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులుకు ఆధిక్యత రావడంతో ఏడో రౌండ్లో తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డి కౌంటింగ్ హాల్ నుంచి నిరాశతో వెను దిరిగారు. 20 రౌండ్లు వరకు ఓట్ల లెక్కింపు నిర్వహించే వరకు అభ్యర్థులు ఉండేవారు. ప్రతి రౌండ్‌కు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు ముందంజలో ఉండడంతో ఇక గెలుపు కష్టమని భావించిన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అక్కడి నుండి వెళ్లిపోయారు. ఓట్ల లెక్కింపులో వైసిపి ఏజెంట్లు ఉండడంతో అభినయ్ రెడ్డి వెళ్లి పోయారు.

టిడిపి అభ్యర్థి గురజాల ఘన విజయం



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజవర్గం నుంబి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన గురజాల జగన్మోహన్ 14,604 ఓట్లు మెజార్టీతో ఘన విజయం సాధించారు. 'నువ్వా ... నేనా' అంటూ ప్రచారం నుండి పోలింగ్ వరకు వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్య గెలుపుల కోసం పోరు సాగింది. ఓటర్లను ఆకట్టుకొనే విషయంలో ఇరు పార్టీల అభ్యర్థులు ఏమాత్రం తగ్గకుండా పోటీ పడ్డారు. టిడిపి అభ్యర్థిగా గుడిపాల మండలానికి చెందిన గురజాల జగన్మోహన్ అనుహ్యాంగా తెరపైకి వచ్చి సేవా కార్యక్ర మాలతో చిత్తూరు నియోజవర్గ ప్రజల ఆదరణ పొందారు. జిల్లాలోనే చిత్తూరు నియోవక వర్గాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసు కున్నా యి. టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్ గెలుపు కోసం మాజీ ఎంఎల్ఏ సికే బాబు, ఎఎస్ మనోహర్, మాజీ కఠారి హేమలతతో పాటు టిడిపి నాయకులు, కార్య కర్తలు పూర్తి స్థాయిలో ఓటర్లను కలసి టిడిపి విజయం సాధిస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిం చడంతో పాటు గురజాల జగన్‌మోహన్ చిత్తూరు నియోవర్గ అభి వృద్ధికి విడుదల చేసిన ప్రత్యేక మ్యాని ఫెస్టోను నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేశారు. స్నేహశీలి, మంచి తనం అందరినీ కలుపుకు పోయే తత్వం గురజాల గెలుపునకు తోడ్పడ్డాయి. మొదటి రౌండ్ నుండి ప్రత్యర్థి ఎంసి విజయానందరెడ్డిపై ఆధిపత్యం ప్రదర్శించారు. మొత్తం 17 రౌండ్ల కౌంటింగ్ పూర్తయ్యాక 14,604 ఓట్ల మెజార్టీతో వైసిపి అభ్యర్థిపై విజయం సాధించారు. వైసిపి అభ్యర్థి ఎంసి విజయా నందరెడ్డికి 73,462 ఓట్లు వచ్చాయి. టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు 88,066 ఓట్లు వచ్చాయి.